క్లుప్తంగా

పర్ణశాలలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందం


ఆలయ ఆవరణలో అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని న్యూఢిల్లీకి చెందిన జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) అధికారి మదన్‌గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ మేరకు ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి విశిష్టతను తెలుసుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, రేంజర్ కనకమ్మ, ఆర్‌ఐ లక్ష్మయ్య, ఫారెస్ట్ సెక్షన్ అధికారి సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

టాయిలెట్లు నిర్మించాలి

అశ్వాపురం: అశ్వాపురం మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని మండల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కూరపాటి చలపతిరావు అధ్యక్షతన శుక్రవారం మండల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆదివారం, సోమవారం రోజుల్లో సంతకు వస్తున్న మహిళలు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ భూక్యా చందూలాల్, టీడీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుక్కాని ప్రకాష్‌రావు, ఓరుగంటి భిక్షమయ్య, బీఆర్‌ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, ఆదివాసీ జేఏసీ మండలాధ్యక్షుడు అనిల్‌కుమార్, వీరస్వామి, సతీష్, సురేందర్‌రెడ్డి, కృష్ణ, భరత్‌కుమార్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, రాజేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వర్కర్ల సమస్యలపై వినతి

మణుగూరు రూరల్ : ఓబీ కంపెనీల్లో పని చేస్తున్న డ్రైవర్లకు, ఆపరేటర్లకు హైస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మణుగూరు ఏరియా సింగరేణి ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్‌కు ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ.. ఏఎల్‌సీ సమక్షంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీతో సింగరేణి యాజమాన్యం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ నాగార్జున, నాగేశ్వర్, వంశీ పాల్గొన్నారు.

నేడు 5కే రన్

మణుగూరుటౌన్: నేడు మణుగూరు మండలంలో రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5గంటలకు పీవీకాలనీ అంబేడ్కర్ పార్కు నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేషన్‌డీలర్ల అక్రమాలపై విచారణ చేపట్టాలి

బూర్గంపాడు: రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై అధికార యంత్రాంగం విచారణ చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బియ్యం పంపిణీలో రేషన్ డీలర్లే వ్యాపారుల పాత్ర పోషిస్తు ప్రజల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారని, రేషన్ పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై నిఘా పెట్టి బాధ్యులపై కఠినచర్యలు చేపట్టాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరకగూడెం: నేడు 33/11 కేవీ కరకగూడెం ఉప కేంద్రం నందు మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కరకగూడెం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

గ్రామసభ

దమ్మపేట: మండల పరిధిలోని అల్లిపల్లి గ్రామంలో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపికకు సర్పంచ్ బెల్లం నాగమణి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. దరఖాస్తులు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తహసీల్దార్ స్వామి అన్నారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపాటి రామచంద్రప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

26 నుంచి యోగా శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాద్రి యోగ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 24 వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు యోగా గురూజీ నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని సీతారాయ నగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

అధిక ధరలకు మద్యం..!

సిండికేట్‌గా ఏర్పడి భారీగా దోపిడీ

- ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోని వైనం
- చూసీ చూడనట్టుగా అధికారులు



మణుగూరు రూరల్ : మణుగూరులో మద్యం అధిక ధరలకు విక్రయిస్తూ మందుబాబులను దోచుకుంటున్నారు. సిండికేట్‌ను అడ్డుపెట్టుకుని మణుగూరులోని కొంతమంది బడాబాబులు కోట్లలో మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. మణుగూరులోని వైన్ షాపులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారు. వైన్‌షాపులో విక్రయించాల్సిన మద్యాన్ని సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపులకు విక్రయిస్తున్నారు. సంక్రాంతి సమయంలో మణుగూరులో సిండికేట్ నిర్వాహకులు భారీగా మద్యం రేట్లను పెంచి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు మణుగూరులో నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం పట్టణ ప్రజలను ఒక్కింత ఆశ్చర్యానికి గురి చేసింది. ఒక వైపు మద్యంపై ప్రభుత్వం ధరలు పెంచడంతో మద్యం సేవించే వారు ఇబ్బంది పడుతుంటే సిండికేట్ నిర్వాహకులు మరింత ధరలను పెంచి మద్యం బాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. అర్ధరాత్రుల వరకు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. బెల్ట్ షాపుల్లో మద్యం సేవించి రాత్రి సమయాల్లో ఘర్షణలు పెట్టుకుంటున్న మందుబాబుల వలన స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా మణుగూరు సిండికేట్ నిర్వాహకులు బెల్ట్ షాపుల నిర్వాహకుల తీరుపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా అడ్డుపడడం సరికాదని ప్రజలు ముక్తకంఠంతో ప్రశ్నించినా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పట్టించుకోని సిండికేట్..

మండలంలోని గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారు. చిన్న చిన్న కిరాణా దుకాణాలను ఏర్పాటు చేసి పల్లెల్లో మద్యాన్ని సిండికేట్ అండదండలతో పగలు, రాత్రి అనే తారతమ్యం లేకుండా విక్రయాలు జరుపుతున్నారు. ప్రధానంగా పీవీ కాలనీ, సమ్మక్క–సారలమ్మ గుడి ప్రాంతం వద్ద, సీటైప్ తదితర ప్రాంతాల్లో మద్యాన్ని అర్ధ రాత్రి వరకు విక్రయించడంతో అటుగా పలు పనులపై వెళ్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాప్ నిర్వాహకులు ఏమైనా ఉంటే సిండికేట్ నిర్వాహకులతో మాట్లాడుకోండంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా సిండికేట్ నిర్వాహకులు మాత్రం తమకేమి పట్టనట్లు, చూసిచూడనట్లు తమ వ్యాపారాన్ని జోరుగా అధిక లాభాల్లో నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిండికేట్ అధిక ధరలను నియంత్రించి అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు తగ్గించాలి



మణుగూరులో సిండికేట్‌గా ఏర్పడి మద్యాన్ని అధిక ధరలకు అమ్ముతున్న వారి పట్ల చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బెల్ట్ షాపుల్లో మద్యం తాగే మందుబాబుల వల్ల మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– మునిగెల హరిబాబు, మణుగూరు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం


మణుగూరు రూరల్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : మండలంలోని కట్టుమల్లారం గ్రామానికి చెందిన రావులపల్లి నాగరాజు, కొర్స రత్నంలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, సమితి సింగారం ఏరియాలో పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. ప్రతీ కార్యకర్తకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ముత్యంబాబు, అప్పారావు పాల్గొన్నారు.

రేగాకు సన్మానం

దుమ్ముగూడెం: ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. చర్ల పర్యటనకు వెళ్తున్న రేగా కాంతారావు మండలంలోని రేగుబల్లి, లక్ష్మీనగరం గ్రామంలో కొంచెం సేపు ఆగి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఎంపీపీ రేసు లక్ష్మీ, ప్రధానకార్యదర్శి కణితి రాముడు, అధికార ప్రతినిధి జానీపాషా, ఎంపీటీసీ సోడి తిరుపతిరావు, సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, నాయకులు కణితి లక్ష్మణ్, లంక శివ, కెల్లా శేఖర్, కొత్తూరి సీతారామరావు, కొత్త మల్లేష్, జిలకర్ర గంగరాజు, మడకం భూపతి, పాయం వెంకటేష్, యాంబడి అర్జున్, శ్రీను పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

చర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం చర్లలోని గడికోట క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు సోయం రాజారావు, శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కృష్ణార్జునరావు, పొడియం మురళీ, అశోక్, కొటేరు శ్రీనివాస రెడ్డి, ఎస్‌డీ అజీజ్, తాతారావు, నాగరాజు తుర్రం రవికుమార్, కాకి అనీల్, ఈశ్వర్ ఉన్నారు.

‘చలో నాగర్‌కర్నూల్’ను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలం: దళిత, గిరిజన, బహుజనులపై జరుగుతున్న దాడులకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన ‘చలో నాగర్‌కర్నూల్’లో పాల్గొని జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరేల రవికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజన, బహుజనులపై దాడులు జరుగుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ నెల 22న చేపట్టిన దళిత గిరిజన ఆత్మగౌరవ దండోరాకు జిల్లాల నుండి ప్రజలు వేలాది సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సరేళ్ల నరేష్, నాయకులు బొలిశెట్టి రంగారావు, శ్రీనివాస్ గౌడ్, హనుమంతరావు, వెంకటేష్, రాసమల్ల రాము, వెంకటనరసయ్య, సతీష్, కొప్పుల సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


బూర్గంపాడు: ఆర్థికసాయం అందజేస్తున్న నేస్తం ట్రస్ట్ ప్రతినిధులు

బూర్గంపాడు: మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన కనకం భవాని ఆరేళ్లుగా బోన్ టీబీతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయమందించారు. ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, కార్యదర్శి ఇళ్ల వెంకట రాజేష్, ఆవుల శివనాగిరెడ్డి, పేరం రామిరెడ్డి, బాలనారాయణరెడ్డి, యక్కటి శ్రీనివాసరెడ్డి, తోకల అనిత, కనకు సీతయ్య పాల్గొన్నారు.

మండలంలోని ముసలిమడుగు గ్రామంలో తోమటి వెంకటేశ్వర్లు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా అతనిని జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మార్కెట్‌కమిటీ చైర్మన్ పొడియం ముత్యాలమ్మ అతనిని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం, బియ్యం, నిత్యావసరాలను అందించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సర్పంచ్ కుర్సం వెంకటరమణ, బొర్రా రాఘవులు, పొడియం నరేందర్, కుర్సం వెంకన్న, తన్నీరు రాజు, ఏడుకొండలు, వర్సా మల్లమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండలంలోని మొండికుంటకు చెందిన పిచ్చయ్య మెదడులో రక్తం గడ్డకట్టగా, ఆర్థిక సమస్యలతో వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఎదురైంది. ఈమేరకు గ్రామానికే చెందిన ఇంటలిజెన్స్ ఏఎస్సై కాసరబాద శ్రీనివాస్ ఆయనకు శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, రామగిరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

దమ్మపేట: యువకుడిపై దాడి చేయడమే కాకుండా అతని కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించిన ఘటన మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మందలపల్లి గ్రామానికి చెందిన మంగిని మారి అనే యువకుడు మరో నలుగురు యువకులతో కలసి గురువారం రాత్రి సమయంలో బైక్‌లపై శబ్దాలు చేస్తూ గ్రామంలో తిరిగారు. గ్రామానికి చెందిన గంట అశోక్ అనే యువకుడు ప్రశ్నించగా, కోపంతో వారు అతడిని గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను ఆదుకుని, ప్రభుత్వం వారి సంక్షేమానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎస్పీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అలవాల రాజా పెరియార్ అన్నారు. శుక్రవారం ఎంఎస్పీ ఆధ్వర్యంలో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారావు, రవికుమార్, హనుమంతు, తిరుపతి, వెంకటేశ్వరరావు, ప్రభాకర్, రాంబాబు, రాజు, సత్యనారాయణ, హేమలత, సూర్యవాణి, సమ్మక్క, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవాలి

మణుగూరుటౌన్: రెడ్డీలు అందరు ఐక్యంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర రెడ్డి జాగృతి అధ్యక్షుడు పిట్టా శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు మండలంలోని హీరోషోరూంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడానికి ముందు నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంది రామచంద్రారెడ్డి, మందాడి అరవిందర్‌రెడ్డి, నాసిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సామ శ్రీనివాసరెడ్డి, యూటీ రెడ్డి, సరెడ్డి రాఘవరెడ్డి, అశోక్‌రెడ్డి, మౌనిక వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, శ్యామల రామిరెడ్డి, శ్రీలతరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

దమ్మపేట: ఆయిల్ ఫెడ్ వార్షిక(2023) క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. శుక్రవారం అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో గల అప్పారావుపేట, నారంవారిగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్లు తమ సిబ్బందితో కలసి, ఎమ్మెల్యేను ఆయన నివాసం తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మేనేజర్లు శాలువాతో సత్కరించారు. మేనేజర్లు కళ్యాణ్, బాలకృష్ణ, నాగబాబు, సిబ్బంది విష్ణు, నాయకులు అబ్దుల్‌జిన్నా పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డా. జేవీఎల్ శిరీష ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంఅ ఎండీ.ఫైజ్ మొయిద్దీన్ బృందం శుక్రవారం భద్రాచలంలోని పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఆయుషి నర్సింహ హోం, కిమ్స్ ఆస్పత్రి, నీలా నర్సింగ్ హోమ్‌లోఎఫ్–ఫారమ్స్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానింగ్ మిషన్ల పనితీరును, సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డీఎంఅ మాట్లాడుతూ... అనుమతులు లేకుండా స్కానింగ్ మిషన్ ఉపయోగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ నెలా ఎఫ్–ఫారమ్స్ ఆన్లైన్ చేసి ఒక కాపీని జిల్లా కార్యాలయానికి 5వ తేదీలోపు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ టి.విజయ్ కమార్, జూనియర్ అసిస్టెంట్ ఎస్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

27న కలెక్టరేట్ ఎదుట ధర్నా

మణుగూరు రూరల్ : సంక్షేమ బోర్డు ద్వారా నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పుతల నరసింహారావు తెలిపారు. శుక్రవారం సంఘం స్థానిక కార్యాలయంలో ఫెడరేషన్ క్యాలెండర్లను, డైరీలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం నిర్మాణరంగ కార్మికుల చట్టాలను, వలస కార్మికుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఔట్‌కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఫెడరేషన్ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు బ్రహ్మాచారి, నియోజకవర్గ కన్వీనర్ గద్దల శ్రీనివాస్, ఫెడరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా

బూర్గంపాడు: ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) నుంచి అందుతున్న ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు భరోసానిస్తుందని జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత అన్నారు. మండల పరిధిలోని బూర్గంపాడు, సారపాక, నకిరిపేట గ్రామపంచాయతీలలోని 12 కుటుంబాలకు శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, గొనెల నాని, బొల్లు రవి, జక్కం సర్వేశ్వరరావు, కొనకంచి శ్రీనివాస్, బాలి శ్రీహరి, తిరుపతి ఏసుబు, చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి


అన్నపురెడ్డిపల్లి: కంటి పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి పర్శియానాయక్

అన్నపురెడ్డిపల్లి: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి పర్శియానాయక్ అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. శిబిరంలో కంటి పరీక్షలకు వచ్చిన వారి పేర్ల నమోదు, కంటి పరీక్షల తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి ప్రియాంక, తన్మయి, డీపీఎంఅ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎస్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలకేంద్రం చంద్రుగొండలోని రైతువేదికలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి పర్శియానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో రికార్డులను పరిశీలించి, డాక్టర్ల బృందాలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ కనకం తనుజా, హెచ్‌వీ ఇమాం పాల్గొన్నారు.


కరకగూడెంలో..

కరకగూడెం: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో కంటి వెలుగు శిబిరంలో కరకగూడెం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గ నరేష్ సుమారు 102 మంది రోగులను పరీక్షించి పలువురికి కళ్లజోళ్లను అందజేశారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ


పతకాలు సాధించిన క్రీడాకారులు

భద్రాచలంటౌన్: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 15 నుంచి 20 వరకు జరిగిన జాతీయ స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో భద్రాద్రి క్రీడాకారులు తమ సత్తా చాటారు. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో పట్టణంలోని సీటీ స్టైల్ జిమ్‌కు చెందిన క్రీడాకారులు రెండు బంగారు పతకాలను సాధించారు. ఈ పోటీల్లో 84 కేజీల విభాగంలో మహమ్మద్ అబ్బాస్, 105 కేజీల విభాగంలో గాలి రామ్మోహన్‌రావులు అత్యుత్తమ ప్రతిభ చాటి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.మల్లేష్, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి, బాడీ బిల్డింగ్ జిల్లా అధ్యక్షుడు తంతరపల్లి వసంతరావు, వీరారెడ్డి పట్టణ ప్రముఖులు, క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి


మాట్లాడుతున్న రమాదేవి

చంద్రుగొండ : విద్యార్థులు చిన్ననాటి నుండి మంచి ప్రవర్తనతో మెలగాలని షీ టీం ఎస్సై రమాదేవి కోరారు. మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలని, అవసరం కొద్దే స్మార్ట్‌ఫోన్‌లు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉండేటి ఆనంద్‌కుమార్, ఏఎస్‌ఐ కృష్ణారావు, ఉపాధ్యాయులు డి.నర్సింహారావు, ఎండీ వాజీద్, లక్ష్మణ్, శకుంతల, కౌసర్‌బేగం పాల్గొన్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

మణుగూరుటౌన్: కొండాపురం మైన్‌లో కార్మికులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొండాపురం మైన్ 11వ లెవెల్ వరకు నడిచిన 15 హెచ్‌పీ ఫ్యాన్‌తో నడిపించడంతో కార్మికులకు పనిచేసే స్థలంలో వెంటిలేషన్ సరిపోవడం లేదన్నారు. తాగునీటి సౌకర్యం, రెస్టు షెల్టర్స్ సైకిల్‌స్టాండ్స్ నిర్మించాలన్నారు. సూపర్‌వైజర్లకు, టెక్నీషియన్లకు సరైన సౌకర్యాలు కల్పించాలని, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవీ.రాంనరసయ్య, నాయకులు నాగరాజు, యోహన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



విరిగిన విద్యుత్ స్తంభం



మండల పరిధిలోని ఈ బయ్యారం గ్రామంలో రైస్ మిల్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం మధ్యకు విరిగి ప్రమాదకర స్థితిలో ఉంది. ప్రధాన రహదారి పక్కన కావడం, నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు తిరుగుతుండడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులు భయపడుతున్నారు. మెయిన్ లైన్ కావడం, నిత్యం విద్యుత్ సరఫరా కావడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– పినపాక

ప్రశ్నించాల్సిన అధికారి : అనుమోలు కావ్య, విద్యుత్ శాఖ ఏఈ, ఈ బయ్యారం.
సెల్ నంబర్ : 9440811557